క్లుప్తంగా

నేటి నుంచి శ్రీమద్రామాయణ ప్రవచనం

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, దేవదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచనం ఉంటుందని జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారరం ఆయన మాట్లాడుతూ మొదటి రోజు శ్రీరామనవమి విశిష్టతపై పసుపులేటి నీలిమ, 24న శ్రీరాముడు – ధర్మ స్వరూపుడు అంశంపై విద్వాన్ మారేడు రాముడు, 25న శ్రీరామాయణం – సీతాయాశ్చరితమ్‌పై పరశురాముని రామకృష్ణ, 26న శ్రీరామాయణం – సేవా ధర్మంపై డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, శ్రీరామాయణం – ఇంటింటికిపై డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, శ్రీరామాయణం – శ్రీరామ రాజ్యంపై గరుడాద్రి వనజకుమారి, శ్రీరామాయణం – జాతికి సందేశంపై హరిబెళ్ సీతామహాలక్ష్మి ప్రసంగించనున్నారన్నారు.

దాన ధర్మాలతో అధిక పుణ్యం



పేదలకు రంజాన్ కిట్లను అందజేస్తున్న సయ్యద్ షఫీపాషా ఖాద్రీ

కర్నూలు(రాజ్‌విహార్): పేదలకు చేసే దాన ధర్మాలతో ఎంతో పుణ్యం లభిస్తుందని లౌబాలి దర్గా పీఠాధిపతి సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ అన్నారు. బుధవారం స్థానిక జొహరాపురంలో సయ్యద్ రసూల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనికులు, ఉద్యోగులు, వ్యాపారులు తమ సంపాదనలో కొంత పేదలకు వెచ్చించాలన్నారు. ట్రస్టు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి మహమూద్ బాషా పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెడుతూ ప్రధాని మోదీ దేశానికి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానిక కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

నేడు శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవాన్ని గురువారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులు ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై కూర్చొబెట్టి గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు చేర్చనున్నారు.

వలంటరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోడుమూరు రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లద్దగిరి-2 గ్రామసచివాలయం పరిధిలో జనరల్, బీసీ–డి జనరల్ పోస్టులు ఖాళీగా ఉండగా, లద్దగిరి-1 గ్రామ సచివాలయం జనరల్, వర్కూరు-గ్రామ సచివాలయం-1 బీసీ–ఏ మహిళ, కోడుమూరు-5 గ్రామ సచివాలయం ఎస్టీ జనరల్, ముడుమలగుర్తి గ్రామ సచివాలయం (క్రిష్ణాపురం) బీసీ–బీ జనరల్ వలంటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు బుధవారం గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన వృషభాల రైతులకు నగదు బహుమతులను దాతల చేతుల మీదుగా అందించనున్నామన్నారు.

30న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 30న రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. 30న రాత్రి 9 గంటలకు భక్తి భజన పోటీలు ఉంటాయని, పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు ఆదే రోజు సాయంత్రం 6 గంటల్లోపు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 97014 47250, 96664 55417 నంబర్లను సంప్రదించాలని కోరారు.



శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం భక్తులు తమ ఇష్ట దేవతామూర్తులను సందర్శించి నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామ దేవతలకు చీరెలు, తీపి వంటలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులతో ఆలయాలన్నీ సందడిగా మారాయి. షడ్రుచుల ఉగాది పచ్చడిని తయారు చేసుకొని ఆరగించారు. రైతులు తమ వృషభాలను అలంకరించి గ్రామాల్లో ఊరేగిస్తూ ఆలయాలను సందర్శించి కొబ్బరి కాయలు సమర్పించారు. పొలాలకు వెళ్లి సేద్యం చేసి సాగును ప్రారంభించారు. ఆలయాల్లో పండితులు, పౌరోహితులు ప్రజలకు పంచాంగాన్ని చదివి వినిపించారు.

–కర్నూలు కల్చరల్



బిర్లాగడ్డ సుంకులాపరమేశ్వరిని దర్శించుకుని నైవేద్యం సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

'నూతన' సంబరం

- తెలుగు సంవత్సరానికి ఘన స్వాగతం పలికిన ప్రజలు
- అలరించిన కవి సమ్మేళనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- వృషభాలను అలంకరించి ఊరేగించిన అన్నదాతలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఏడాదంతా శుభమే

ఏడాదంతా మంచి జరుగుతుందని పండితులు తెలిపారు. నూతన తెలుగు సంవత్సరంలో సంభవించే లాభనష్టాలు, సుఖదుఃఖాలను, పంటలు, వర్షాల పరిస్థితిని వివరించారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. సరైన సమయంలోనే రుతుపవనాలు వస్తాయని, వర్షాలు బాగా కురిసి వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఎలాంటి ఒడిదుడుకులు ఉండవని వివరించారు.

- తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. వేద పండితులు తిరునగరి రమేషాచార్యులు పంచాంగ పఠనం చేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఈఓ దినేష్, భక్తులు పాల్గొన్నారు.
- స్థానిక సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలోని చౌడేశ్వరి మాత, అయ్యప్పస్వామి, కైలాస నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలు జరిగాయి.
- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితులు మామిళ్లపల్లి జగన్మోహన శర్మ పంచాగం పఠనం చేశారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశ మిచ్చారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. తెలుగు కాలమాన పట్టికను ఆవిష్కరించారు.
- ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ స్వామి మందిరంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు ప్రవచనం చేశారు.
- ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పండితులు పంచాగ పఠనం చేశారు. విశ్రాంత తహసీల్దార్ ఎం.హనుమంతరెడ్డి పారిజాతాపహరణం అంశంపై ప్రసంగించారు. కవి సమ్మేళనం అలరించింది. కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి హాజరై కవులును సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- శ్రీనివాసనగర్‌లోని సత్యసాయి మందిరంలో జరిగిన వేడుకల్లో పండితులు గౌరిపెద్ది కమల సాయినాథ శర్మ పంచాగ పఠనం చేశారు. సాయి భక్తులు, సాయి సేవకులు వేడుకల్లో పాల్గొన్నారు. సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.
- స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. సూర్యనారాయణస్వామి మూల విరాట్‌కు అరుణ పారాయణ పూర్వక జలాభిషేకం నిర్వహించారు. విశేషమైన అలంకారంతో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కళాకారునికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న కళాకారుడు హనుమంతరావు చౌదరి

నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, హనుమాన్ కళా సేవా సమితి అధ్యక్షులు హను మంతరావు చౌదరికి ఉగాది పురస్కారం అందజేశారు. విశ్వశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన మందిరంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఉగా ది పురస్కారాలు ప్రదానం చేశారు. కళారంగంలో హనుమంతరావు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనకు, ఆయన సతీమణి లక్ష్మికి ఫౌండేషన్ అధ్యక్షులు కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ఇంకమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.నరసప్ప తదితరులు పురస్కారాలను ప్రదానం చేశారు.



రాంబొట్ల ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్ సుభద్ర, బలదేవ్ మూర్తులు



గౌరనితాయ్ అర్చామూర్తులకు మహా శంఖాభిషేకం చేస్తున్న దృశ్యం



సత్యసాయి మందిరంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న సభ్యులు



సత్యసాయి మందిరంలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు కమలసాయినాథ శర్మ



రాంబొట్ల ఆలయంలో పంచాంగ పఠనం

వైభవంగా వల్లెలాంబదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) వల్లెలాంబ దేవి

కోడుమూరు రూరల్: పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి రథోత్సవం బుధవారం సాయంత్రం అశేషజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా సాగింది. రతోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వల్లెలాంబా..కరుణించవమ్మా అంటూ రథాన్ని ముందుకులాగారు. ముందుగా భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి స్వగృహం నుంచి అమ్మవారికి మొదటి నైవేద్యాన్ని మేళతాళాలతో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు పట్టణంలోని చిన్నబోయవీధి కాలనీవాసులు బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్‌ఐలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

నాటక చరిత్రలో మరపురాని ఘట్టం



పంచాంగ శ్రవణానికి హాజరైన ప్రజలు



జాతీయ ఉత్తమ నాటకంగా ఎంపికైన కమలపాలిక నాటక కళాకారులను సన్మానిస్తున్న బి.వి.రెడ్డి, పుల్లయ్య

కర్నూలు కల్చరల్: జిల్లా నాటక చరిత్రలో ఒక పద్య నాటకం ఏడు బహుమతులు అందుకోవడం మరుపురాని ఘట్టమని పారిశ్రామిక వేత్త బ్రమ్మర్షి బి.వి.రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడలో జరిగిన జాతీయ స్థాయి పద్యనాటక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం ప్రథమ బహుమతితో పాటు ఆరు వ్యక్తిగత బహుమతులు కైవసం చేసుకుంది. ఉత్తమ నాటకంగా ఎన్నికైన శ్రీకృష్ణ కమలపాలిక నటులకు, ఉత్తమ నటుడు శ్రీకృష్ణ పాత్రధారి జి.శ్రీనివాస రెడ్డి, ఉత్తమ నటి కమలపాలిక పాత్రధారి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటుడు చిట్టిదొర పాత్రధారి సంగా ఆంజనేయులు, ఉత్తమ హాస్య నటి సింగారి పాత్రధారి హసీనా, ఉత్తమ సంగీతం హార్మోనిస్టు బి.బలరాముడు, ఉత్తమ దర్శకులు పత్తి ఓబులయ్యను ఉగాది సంబరాల వేడుకల్లో ఘనంగా సత్కరించారు. అంతకుముందు కృష్ణ బృందం నాదస్వర కచ్చేరీతో ఉగాది సంబరాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుడు భానుస్వామి పంచాంగ శ్రవణం, కవులు ఇనాయతుల్లా, డాక్టర్ గుండం పాటి విజయసారధి, డాక్టర్ వి.పోతన, కళ్యాణదుర్గం స్వర్ణలత, కెంగార మోహన్‌లచే నిర్వహించిన కవి సమ్మేళనం ఆకర్షణగా నిలిచింది. రాయల మహిళా సమాఖ్య మహిళలు కోలాటం, దేవిశ్రీ శాస్త్రీయ నృత్య ప్రదర్శన, కరీముల్లా బృందం జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం శ్రీకృష్ణ కమలపాలిక నట బృంద రంగస్థల పద్యాలను వినిపించారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి పల్లకీ సేవ

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడిని బుధవారం పల్లకీలో ఉంచి ఊరేగింపు చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకొని దేవాలయంలో ఉదయం స్వామి వారికి బిందెసేవ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అలంకరణ చేసి అష్టోత్తరనామార్చన, అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం స్వామి వారిని సతీసమేతంగా గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.



పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

పంచలోహ కవచం విరాళం

ఆస్పరి: ఆస్పరిలో వెలసిన ఆంజనేయస్వామికి కర్నూలుకు చెందిన యోగేశ్వరరావు, ఆస్పరికి చెందిన దాసప్పగారి అంజినయ్య అనే భక్తులు రూ.65 వేలు విలువ చేసే పంచలోహ కవచం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారి నిరంజన్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

1 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీరామ నవమి జాతర పురస్కరించుకొని వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఈరన్న, బీసుపల్లి, రవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, గ్రామ నాయకులు సిబి.జానకిరామిరెడ్డి, డి.సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నట్లు చెప్పారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు అందచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 31వ తేదీలోపు జట్టు పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 91821 48165, 82472 30953, ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

శరవేగంగా ఈట్ స్ట్రీట్

- బిర్లా గేట్ సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈట్ స్ట్రీట్
- రూ.80 లక్షలతో పనులు చేపట్టిన మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరం మరింత శోభాయమానంగా మారనుంది. ఇప్పటికే విజయవాడ, హైదరాబాద్ వంటి మహానగరాలతో పోటీ పడుతూ పరిశుభ్రత, పచ్చదనంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అదే ఉత్సాహంతో అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకెళ్తోంది. అందులో భాగంగా నగర వాసులకు ఆహ్లాదాన్ని కలిగించేందుకు మున్సిపల్ అధికారులు బిర్లాగేట్ సమీపంలో గుత్తి వైపు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు నడుంబిగించారు. ప్రభుత్వం స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ ఫండ్స్ మంజూరు చేయడంతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రూ.80 లక్షలతో బిర్లా సర్కిల్ సమీపంలో ఈట్ స్ట్రీట్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

ఆరగింపు.. ఆహ్లాదం..

ఈట్ స్ట్రీట్‌లో 10 దుకాణాలు నిర్మిస్తారు. వీటిల్లో ఆహార పదార్థాలతో పాటు టెండర్ ద్వారా వివిధ కంపెనీలకు చెందిన ఐస్‌క్రీమ్‌లు, స్నాక్స్, తినుబండారాలు ఉంటాయి. 2 ఫౌంటెన్లు, సీటింగ్ సౌకర్యం, పిల్లలు ఆడుకునేందుకు బల్లలు, జారుబండ, ఊయలతో పాటు మొత్తం గ్రీనరీ పెంచుతారు. వీక్షకుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు.



చిన్నారుల కోసం జంపింగ్ నెట్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు



పనులు జరుగుతున్న దృశ్యం



ఈట్ స్ట్రీట్ నమూనా

వచ్చే నెల 15 నాటికి పనులు పూర్తి

నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరవాసుల కోసం ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు బిర్లాగేట్ సమీపంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నంలో విజయవంతమయ్యాయి. కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. వచ్చే నెల 15 నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– మున్సిపల్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్

చెక్‌డ్యామ్‌లో పడి గుల్బర్గా వాసి మృతి

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని హెలిప్యాడ్ సమీపంలో ఉన్న చెక్‌డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడి కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా, జీడిగ గ్రామానికి చెందిన గుర్రప్ప(30) మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం అతని మృతదేహం నీటిపై తేలుతున్నట్లు గమనించిన భక్తులు సమీపంలోని పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వన్‌టౌన్ పీఎస్ రైటర్ సుంకన్న, పోలీసులు చెక్ డ్యామ్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. అతని వద్ద దొరికిన ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించి వారి బంధువులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు చెప్పారు.